క్లుప్తంగా

వేసవి సెలవుల్లో పిల్లలు జాగ్రత్త



చెన్నారావుపేట : పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చిన నేపథ్యంలో పిల్లలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు ఒంటి పూట బడులు, సెలవులు వచ్చిన నేపథ్యంలో పిల్లలు సరదాగా చెరువులు, కుంటలు, బావుల వద్ద ఈతకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలకు అవగాహన కల్పించడంతోపాటు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. పిల్లలు చెరువులు, కుంటలు, బావుల వద్దకు ఈతకు వెళ్లకుండా చూసుకోవాలని చెప్పారు. మొరం గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని చెప్పారు. ఎండల తీవ్రత నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు ఎండలో తిరగొద్దన్నారు. వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, చర్మవ్యాధులు సోకుతాయని తెలిపారు. ఏవైనా పనులుంటే ఎండ రాక ముందే పూర్తి చేసుకోవాలని సలహా ఇచ్చారు.

ఆరాధ్య దైవాలకు పూజలు



శాయంపేట : గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీ కంఠమహేశ్వర, సురమాంబ దేవతలు, శ్రీ ఎల్లమ్మతల్లికి శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని కొప్పుల, గంగిరేణిగూడెం గ్రామాల్లోని తాటిముంజలు, ఉగాది పచ్చడితో మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా కుల పెద్ద గండి చేరాలు మాట్లాడుతూ పిల్లాపాపలు, పాడి పంటలతో అందరూ చల్లగా ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం ఉగాది రోజు శ్రీ కంఠమహేశ్వరునికి ఘనంగా పూజలు నిర్వహించడం గౌడ కులస్తుల ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో గౌడ కులస్తులు పోశాల ఓదేలు, కల్లెపు సుదర్శన్, బొడిగె కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

షోడశపల్లిలో పోలీస్ కళాజాతా



వేలేరు : మండలంలోని షోడశపల్లి గ్రామంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన కళాజాత పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాబృందం వారు రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, చేతబడి, మూఢనమ్మకాలు, సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, కానిస్టేబుల్స్ సుందర్ రాజ్, విలియం, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కమలాపూర్: మండలంలోని కానిపర్తిలో స్నేహ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎంపీడీఓ తౌగరి హనుమయ్య తన తల్లిదండ్రులు కనుకమ్మ–ఐలయ్య స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు కొత్తూరి ఇంద్రసేన, ప్రధాన కార్యదర్శి నరెడ్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జనగాని సుమన్, ఉపాధ్యక్షులు జనగాని సాంబయ్య, మాదిరెడ్డి సంధ్యారాణి, కోడిగూటి బాలరాజు, కన్నెబోయిన అశోక్, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లికి బోనాలు



గీసుకొండ : మండలంలోని ధర్మారంలో పెద్దమ్మ తల్లికి ముదిరాజ్ కులస్తులు మంగళవారం ఘనంగా బోనాలు సమర్పించారు. గ్రామస్తులు బోనాలతో తరలివచ్చి ఊరచెరువు వద్ద ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. డీజే నడుమ ఆటపాటలతో సందడి చేశారు.

ఘనంగా ఉగాది వేడుకలు



వెంకటాపురం(ఎం) రామాలయంలో పంచాంగం చదువుతున్న అర్చకుడు రఘునాథాచార్యులు



వాజేడు: ఉగాది వేడుకల్లో విశ్వకర్మలు

వెంకటాపురం(ఎం): మండలంలో ఉగాది వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. షడ్రుచులచే ఉగాది పచ్చడిని తయారు చేసుకొని స్వీకరించారు. అనంతరం సమీప ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయంలో పంచాంగాన్ని అలయ అర్చకుడు ముదుంబా రఘునాథచార్యులు వివరించారు.

వెంకటాపురం(కె): మండలంలో ఉగాది వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కొందరు రైతులు ఏరువాక సాగారు. ఇంటి ముందు గుమ్మాలకు మామిడాకు, వేపాకు తోరనాలను అందంగా అలంకరించారు. ఇంట్లో పూజాకార్యక్రమాలు నిర్వహించి ఉగాధి పచ్చడి తయారు చేశారు. సాయంత్రం మండల కేంద్రంలోని శివాలయంలో ఆలయంలో పండితులు పంచాంగ శ్రవణం చదివారు.

గోవిందరావుపేట: క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం పస్రా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువజాము నుంచే ఆలయాలకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. మంగళవారం రోజున ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రామాలయంలో నిర్వహించిన పంచాగ శ్రవణానికి గ్రామ పెద్దలు, భక్తులు హాజరయ్యారు. ఆలయ పూజారి డింగిరి రంగాచార్యులు పూజల చేసిన అనంతరం తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు.

వాజేడు: మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో ఉగాది పండుగ వేడుకలను మంగళవారం నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి భక్తుల దేవాలయాలకు వెళ్లడంతో రద్దీ పెరిగింది. ఇళ్లల్లో పిండి వంటలను చేసుకోవడంతో పాటు సహపంక్తి భోజనాలను చేసి ఆనందంగా గడిపారు.

ఐదురోజుల ఉగాది

విశ్వకర్మలు ఐదురోజుల ఉగాది పండుగను మడిబట్టలతో ప్రారభించారు. ఉదయం నాలుగు గంటల నుంచే పండుగ సంబరాలను చేపట్టారు. ఇంట్లో పెరుమాల్లు(పందిరి)ని సీతాఫలం పుల్లలతో వేసి, మోదుగ పూలు, మామిడాకు తోరనాలను కట్టారు. కుల వృత్తికి సంబంధించిన పని ముట్లను పూజలో ఉంచారు. వీరబ్రంహ్మేంద్రస్వామితో పాటు పసుపుతో తయారు చేసిన గౌరమ్మను మిగతా దేవుళ్ల ఫొటోలను పూజలో ఉంచారు. ఈ పూజలను విశ్వకర్మలు ఉపవాసంతో నిర్వహించారు. ప్రసాదంగా బక్షాలు, పిండి, బెల్లం, శనగ పప్పును తయారు చేసుకున్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): మండలంలోని ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రోధనామ సంవత్సరం సందర్భంగా ఉగాది పచ్చడితో పాటు బక్షాలు చేసుకుని పండుగను ప్రత్యేకంగా చేసుకున్నారు. అలాగే పురోహితులచే శ్రవణ పంచాంగాన్ని విన్నారు.

కోటంచలో..

మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అర్చకులు బుచ్చమచార్యులు, శ్రీనాధచార్యులు భక్తులకు శ్రవణ పంచాంగాన్ని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, ఆలయ సిబ్బంది రవీందర్, శ్రావణ్, సుధాకర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తాడిచర్ల స్థానిక వెంకటేశ్వర ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కుటుంబ సభ్యులందరూ కలసి ఆరు రుచులతోన కలిగిన ఉగాది పచ్చడిని సేవించారు. సాయంత్రం సమయంలో వేంకటేశ్వరస్వామి ఆలయ పూజారి పంచాంగం వినిపించారు.

మొగుళ్లపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడులకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల ఆవరణల్లో అర్చకులు పంచాగాన్ని గ్రామస్తులకు వివరించారు.

టేకుమట్ల: క్రోధనామ సంవత్సర సందర్భంగా మండల ప్రజలు ఉగాది పచ్చడితో పాటు, బక్షాలు చేసుకుని పండగ ప్రత్యేకతను చేసుకున్నారు. అలాగే పురోహితులచే పంచాంగాన్ని విన్నారు. పలు చోట్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ తల్లులకు భోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

చిట్యాల: ఉగాది వేడుకలను మండల ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఉగాది పచ్చడితో పాటు బక్షాలు చేసుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు సేవించారు. మండల కేంద్రంలోని శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి దేవాలయంలో గౌడకులస్తులు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. అలాగే ఆలయంలో ఉగాది పచ్చడి చేసుకుని, శ్రవణ పంచాంగాన్ని విన్నారు.

మహదేవపూర్: మండల కేంద్రంలో ఉమమహేశ్వర ఆలయంలో శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో మంగళవారం పంచంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అరుణ, కాంగ్రెస్ సినియర్ నాయకులు వామన్‌రావు, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.



వెంకటాపురం(కె): పంచాంగం చదువుతున్న పండితులు

భూపాలపల్లి రూరల్: శ్రీకోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పక్కీరుగడ్డలోని బాలాంజనేయ దేవస్థానంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు.

కాటారం: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజలు మంగళవారం తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి, భక్తాంజనేయ స్వామి ఆలయాలతో పాటు శ్రీ ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. రైతులు సంప్రదాయ పద్ధతిలో అరక దున్ని తమ పంట సాగును ప్రారంభించారు. ఏడాది పాటు పంట సాగులో లాభాలు కలిగేలా కరుణించాలని దేవుడిని వేడుకున్నారు. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు.



రామప్ప ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖారే



పస్రాలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పంచాగాన్ని వివరిస్తున్న పూజారి రంగాచార్యులు

ఈ కార్యక్రమంలో పలు ఆలయాల పురోహితులు మాడుగుల నాగరాజుశర్మ, భానుప్రకాశ్‌శర్మ, నిఖిల్ శాస్త్రీ, సురేశ్‌శర్మ, ఆలయ కమిటి సభ్యులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట: మండల పరిధిలోని ఇప్పలగడ్డ చెక్ పోస్ట్ వద్ద రహదారిపై ఎన్నికల కోడ్ నేపథ్యంలో పస్రా ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. అలాగే పస్రా జెడ్పీహెచ్ఎస్ హై స్కూల్, ముద్దులగూడెం గ్రామ శివారులో ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేసి వాహనదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం సరఫరాను అడ్డుకోవటానికి పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న దామోదర్

రేగొండ: క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కవులు, కళాకారులకు జిల్లా కేంద్రంలో మంగళవారం అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయిని సంపత్‌రావు పాల్గొన్నారు. అవార్డు పురస్కారాలలో భాగంగా సినీరంగంలో సేవలను అందించినందుకు గాను మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన తాళ్లపల్లి దామోదర్ గౌడ్‌కు అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొల్గూరి సంజీవరావు, అప్పం కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన తక్కళ్లపల్లి రవీందర్ రావును పట్టణంలోని 20వ వార్డు మిత్ర బృందం సభ్యులు మంగళవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు సుదర్శన్‌రెడ్డి, మహేందర్, ఆనంద్, రాజు, గౌరారెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్ తాడ్వాయి: సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటులో భాగంగా మండలంలోని నార్లాపూర్‌లో మంగళవారం గ్రామస్తులతో ఎస్సై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలు, నేరాలు, అజ్ఞాతవ్యక్తుల సంచారాలు సులువుగా పసిగట్టే అవకాశం ఉంటుందని వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు గుడుంబా నిర్మూలన, ప్లాస్టిక్ నిషేధంపై గ్రామస్తులతో చర్చించి అభిప్రాయాలను స్వీకరించారు. కాగా, గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు. గ్రామస్తులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. మిగతా గ్రామాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలను భాగస్వాములను చేస్తామని ఎస్సై తెలిపారు.

గాడితప్పిన పంచాయతీ పాలన!

మంగపేట: మండలంలో అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీల పరిపాలన గాడితప్పిందని మండల ప్రజలు వాపోతున్నారు. దీనిపై పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. మండలంలో 15 ఏళ్లుగా సర్పంచ్ ఎన్నికలు జరుగక పోవడంతో పంచాయతీల పాలన పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకధికారుల పర్యవేక్షణలో కొనసాగుతోంది. మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రత్యేకధికారుల బాధ్యతను నిర్వహిస్తున్నప్పటికీ వారు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళ్తున్నారో తెలిడం లేదని దీంతో ఏ పంచాయతీకి ఎవరూ ప్రత్యేకధికారో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో గ్రామసభలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని పచాయతీల అభివృద్ధి నిధులు దేనికి ఎంత ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని తెలుపుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో ఉండగా గ్రామాల్లో ప్రజా సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. గ్రామపంచాయతీ అనుమతి లేకుండా రూ.లక్షల్లో వ్యాపారాలు నిర్వహించే వారి నుంచి పన్నులు వసూలు చేయకుండా కొందరు పంచాయతీ కార్యదర్శులు నెల నెలా ముడుపులు తీసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ప్రచారం బాహాటంగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా కొందరు పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండటంలేదని పన్నుల ద్వారా వసూలు చేసిన డబ్బులను సొంతానికి వాడుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విషయంపై మంత్రి స్పందించి ప్రత్యేకాధికారి ద్వారా గ్రామ పంచాయతీల వారిగా రికార్డుల ఆధారంగా గడిచిన ఆరునెలల కాలంలో పన్నుల రూపంలో ఎంత వసూలు, వసూలు చేసిన డబ్బులలో ఎస్టీఓలో ఎంత జమచేశారనే విషయంపై విచారణ జరిపిస్తే అవినీతి అక్రమాలు బయటపడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. ఈ విషయంపై మంత్రి సీతక్క, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు మండల ప్రజలు తెలిపారు.

ఏకపక్ష ఎన్నిక సరికాదు



మాట్లాడుతున్న ఆదినారాయణ

వాజేడు: ఏకపక్షంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఎన్నిక సరైంది కాదని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తల్లడి ఆదినారాయణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల అధ్యక్షుడి ఎన్నిక సమయంలో మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య మండలంలోని కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకోక పోవడం సరైంది కాదన్నారు. ప్రస్తుత అధ్యక్షుడి కన్నా సీనియర్ కార్యకర్తలు చాలా మంది ఉన్నారని పార్టీ కోసం అహర్నిషలు పని చేసే వారు ఉన్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ అధ్యక్షుడు దంతులూరి సీతారామ రాజు, ప్రసాద రాజు, విక్రాంత్, జగన్నాథ రాజు, ఖజావళి, నర్సింహ రావు, ఏసు, రామ్మూర్తి, షాబీర్ పాషా, రాంబాబు తదితరులు ఉన్నారు.

రాంజీగోండుకు ఘన నివాళి



రాంజీగోండు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయికులు

మహాముత్తారం: స్వాతంత్ర్య సమరయోదుడు రాంజీగోండు వర్ధంతిని మండలంలోని పోలంపల్లి గ్రామంలో మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల కోసం రాంజీగోండు గోప్పపోరాటం చేసిన వీరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం చిన్నరాజేందర్, మల్లు రాజేందర్, శ్రీను, రమేష్, తిరుపతి, సదానందం, పోశయ్య, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విస్తృత స్థాయి సమావేశం

మంగపేట: మండలంలోని బోరునర్సాపురంలో నేడు (బుధవారం) కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పటేల్ హాజరవుతున్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు గాదె శ్రావన్‌కుమార్, జిల్లా నాయకులు వల్లెపల్లి శివప్రసాద్, మండల సీనియర్ నాయకులు మండవ రామకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు!

వాజేడు: మండల కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు చోటు చేసుకున్నాయి. మండల నూతన అధ్యక్షుడి ఎన్నికతో వచ్చిన భిన్నభిప్రాయాలతో రెండు వర్గాలుగా చీలిపోయారు. వివరాల్లోకి వెళితే.. భద్రాద్రికొత్త గూడెం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య సోమవారం వాజేడు మండలానికి వచ్చి పార్టీ మండల అధ్యక్షుడిగా బొల్లె డెనార్జున్ రావును నియమించినట్లు ప్రకటించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సమయంలోనే మాజీ అధ్యక్షుడు దాట్ల సీతారామరాజుతో పాటు మరికొందరు సీనియర్ నాయకులు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును దాదాపు 85 మందితో వెళ్లి కలిశారు. ఈ క్రమంలో కొత్త అధ్యక్షుడి వర్గం ఒక వైపు, మాజీ అధ్యక్షుడి వర్గం ఒక వైపుగా మారాయి. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే సమయంలో అందరి కార్యకర్తల అభిప్రాయం తెలుసుకోలేదని ఎమ్మెల్యేను కలిసిన వారి వాదనగా వినిపిస్తుంది. ఇది ఇలానే కొనసాగితే మండలంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి వర్గాలతో సతమతమయ్యేలా ఉంది.

రామాలయంలో పందిరి ముహూర్తం



పాలకర్రతో పందిరి వేసేందుకు ముహూర్తం చేస్తున్న అర్చకుడు నాగేశ్వర్‌రావు శర్మ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం పందిరి ముహూర్తం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈనెల 17వ తేదీన శ్రీరామ నవమి కల్యాణ మహోత్సవంలో భాగంగా పచ్చని పందిర్లు వేసేందుకు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ ఆధ్వర్యంలో చలువ పందిర్లు వేసేందుకు ముహూర్తం చేశారు. మరో వారం రోజుల పాటు పందిర్లు ఏర్పాటు చేయడం, కల్యాణం కోసం ఆలయాన్ని ముస్తాబు చేసే కార్యక్రమాలను చేపట్టనున్నారు. అలాగే సాయంత్రం 6 గంటలకు పంచాగ శ్రవణ కార్యక్రమాన్ని అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు, భక్తులు బ్రహ్మం, సాంబయ్య, సమ్మయ్య, సంతోష్; శ్రీనివాస్, పోతరాజు, నర్సయ్య పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు



భూపాలపల్లి అర్బన్: పతాకావిష్కరణ చేస్తున్న పీసీసీ సభ్యుడు మధు



మహాముత్తారం: కేక్ కట్ చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు బట్టు కర్ణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీసీసీ సభ్యుడు చల్లూరి మధు హాజరై పతాకావిష్కరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు రాజేందర్, సురేష్, ప్రేమ్, సుబ్బు, తిలక్‌చారి, అఖిల్, రాజు, మహేందర్, శశి, కార్తిక్‌లు పాల్గొన్నారు.

మహాముత్తారం: ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ములుగుపల్లి గ్రామంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎన్ఎస్‌యూఐ విభాగం ఎంతగానో కృషి చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు పుట్టపాక వీరాస్వామి, శ్రీశైలం, భాస్కర్, భానుచందర్, పూర్ణచందర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.